క్లుప్తంగా

49 కేసుల పరిష్కారం

అమరావతి: మండలానికి చెందిన పలు కేసులు శనివారం సత్తెనపల్లి కోర్టుల్లో నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో పరిష్కరించారని అమరావతి సీఐ ఎం.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరు వర్గాల రాజీకి అంగీకరించిన అనంతరం మండలానికి చెందిన 14 కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు. అలాగే జూదం, రవాణాకు సంబంధించిన 35 కేసులు ఉన్నట్లు వెల్లడించారు.

నిమజ్జనోత్సవంలో ఘర్షణ

ముప్పాళ్ళ: వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన వివాదం ముదిరి రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇందులో ఒకరికి గాయాలైన ఘటన ఇరుకుపాలెంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలోని బీసీ కాలనీలో ఒకే సామాజిక వర్గానికి చెందిన నార్నెపాటి సాంబశివరావు, కొర్నెపాటి యలమంద వర్గీయులు వేర్వేరు చవితి మండపాలు ఏర్పాటు చేసుకున్నారు. రెండు వర్గాల విగ్రహ నిమజ్జనాల సందర్భంగా స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. ఆదివారం రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగటంతో కొర్నెపాటి యలమంద తలకు గాయమైంది. అతనిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

చెట్ల తొలగింపు

క్రోసూరు: ఇటీవల కురిసిన వర్షాలకు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న జామాయిల్ చెట్లు భవనంపై పడిపోయాయి. తహసీల్దార్ ఆదేశాల మేరకు వాటిని తొలిగించారు. విద్యుత్ తీగలు తెగిపోయానని, పార్కింగ్ కూడా సమస్యగా మారిందని తహసీల్దార్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

ఉద్యమాల వేగు చుక్క ఏచూరి



పెదకూరపాడు: ఉద్యమాల వేగు చుక్క సీతారం ఏచూరి అని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ బెల్లంకొండ రామగోపాలరావు అన్నారు. పెదకూరపాడులో సీపీఎం ఆధ్వర్యంలో సీతారం ఏచూరి చిత్ర పటానికి ఆదివారం నివాళులర్పించారు. తను నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి గత 50 ఏళ్లు సీపీఎంలో ఏచూరి కృషి ఆదర్శమన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, కాల్వ అప్పారావు, గుప్తా వెంకటేశ్వర్లు, మలినేని నరసింహరావు, రామనాథం, కొనగండ్ల సాంబశివరావు, మస్తాన్‌రావు నివాళులర్పించారు.

సత్తెనపల్లి డీఎస్పీగా హనుమంతరావు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీగా మేదరమెట్ల హనుమంతరావును నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ డీఎస్పీగా పని చేస్తున్న జి.గురునాథ్ బాబును పోలీస్ హెడ్ క్వార్టర్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 1991 ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన హనుమంతరావు ఎస్ఐగా గుంటూరు కొత్తపేట, పెదకాకాని, నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్లలో పని చేశారు. సీఐగా గుంటూరు లాలాపేట, అమరావతి, పిడుగురాళ్ల, నెల్లూరు జిల్లా గూడూరులో పని చేశారు. మూడేళ్ల క్రితం డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన ప్రస్తుతం పీసీఎస్ అండ్‌ఎస్ డీఎస్పీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి రానున్నారు.

ఉచిత వైద్య శిబిరం



దొడ్లేరు(క్రోసూరు): మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దొడ్లేరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కాటూరి మెడికల్ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సుందర్, శ్రీకర్ భరత్ 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్ పద్మ అబ్దుల్ అజిత్, మొగల్ జానీ, ప్రసాద్, ఆర్‌ఎంపీ డాక్టర్ హుస్సేన్ పాల్గొన్నారు.

అన్నదానం



నకరికల్లు: స్థానిక బ్యాంకు బజారులోని విఘ్నేశ్వర మండలంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సమస్యల గురుకులం

- కొత్తగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నో యూనిఫాం
- 564 మంది విద్యార్థులకు 40 మరుగుదొడ్లు
- గత ప్రభుత్వ నిధులతో కొంతమేర మరమ్మతులు



తలుపులేని మరుగుదొడ్లు



కిటికీలు లేని పడకగదులు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల చదువులు సమస్యల మధ్య కొనసాగుతున్నాయి. నూతనంగా అడ్మిషన్ పొందిన 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు, ఖాళీల భర్తీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు యూనిఫాం ఇంతవరకు అందలేదు. గత ప్రభుత్వం ఏటా జూన్‌లోనే విద్యార్థులందరికీ మూడు జతల చొప్పున యూనిఫాం దుస్తులు ఇవ్వడం జరిగింది. కుట్టు కూలి కూడా ఇచ్చేవారు. పాఠశాల తెరిచి మూడు నెలలు కావస్తోంది. కానీ, ఈ ఏడాది ఇంత వరకు కొత్తగా చేరిన విద్యార్థులకు యూనిఫాం ఇవ్వలేదు.

మరుగుదొడ్ల కొరత

పాఠశాలలో 564 మంది విద్యార్థులున్నారు. కనీసం 60 నుంచి 70వరకు మరుగు దొడ్లు మరో 70 స్నానాల గదులు ఉంటేగాని సరిపోవు. కాని తాత్కాలికంగా నిర్మించిన మరుగుదొడ్లతో కలిపి ప్రస్తుతం 40 మాత్రమే ఉన్నాయి. 5 నుంచి 10వరకు 452 మంది, 102 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులున్నారు.

స్కూల్ మానిటరింగ్ ఫండ్‌తోనే మరమ్మతులు

స్కూల్ మానిటరింగ్ ఫండ్ కింద గత ప్రభుత్వం రూ.6.68 లక్షల నిధులు మంజూరు చేసింది. అందులో రూ.4 లక్షలతో పాఠశాలలో విరిగిన కొన్ని కిటీలు, మరుగు దొడ్లకు సీట్లు, తలుపులు ఏర్పాట చేశారు. డార్మిటరీలో కిటికీలు ఫ్రేమ్‌లతో సహా పూర్తిగా విరిగిపోయాయి. కొంత మొత్తం వాటి మరమ్మతులకు వినియోగించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. మరో రూ.2.68 లక్షల ఫండ్ నూతనంగా ఏర్పడిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో వినియోగించాల్సి ఉంది. విద్యార్థుల పడక గదులు అధ్వానంగా ఉన్నాయి. కిటికీలకు ఊచలు ఊడిపోవడంతో కోతులు లోనికి ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు.

14,600 టూ వీలర్స్‌కు ఉచిత మరమ్మతులు



సింగ్‌నగర్‌లో వాహనాలకు సర్వీస్ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ మెకానిక్‌లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద ముంపులో మునిగిపోయి పాడైపోయిన టూ వీలర్స్‌కు నవ్యాంధ్ర టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్(సత్తెనపల్లి) ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మరమ్మతులు చేశారు. నగరంలోని ముంపు ప్రాంతాలైన సింగ్‌నగర్, భవానీపురం చర్చి సెంటర్, ఊర్మిళానగర్, సితార సెంటర్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ తదితర ముఖ్య కూడళ్లల్లో మొత్తం 13 పాయింట్లను ఏర్పాటు చేసి ముంపులో పూర్తిగా దెబ్బతిని స్టార్ట్ అవ్వని ద్విచక్ర వాహనదారులకు ఉచిత సేవలు అందించటంపై టూ వీలర్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ప్రతి టూ వీలర్‌లో నుంచి వరద నీరు బయట పడుతుంది. వరద నీళ్లలో మునిగి బాగు చేయించుకునే స్తోమత లేని వారి కోసం ఈ ఉచిత మెగా వర్క్‌షాప్ ఏర్పాటు చేశామని అసోసియేషన్ వ్యవస్థాపకుడు షేక్ సుభాని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 380 మంది మెకానిక్‌లు విజయవాడ వచ్చారని చెప్పారు. ముందుగా 10 పాయింట్లు మాత్రమే పెడతామని అనుకున్నామని, అయితే కొన్ని ముంపు ప్రాంతాల నుంచి మహిళలు తమ స్కూటీలను నెట్టుకుంటూ రావడం చూసి మరో మూడు పాయింట్లు ఏర్పాటు చేశామని సుభాని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఒక్కో పాయింట్‌లో సుమారు 1100 మంది చొప్పున టూ వీలర్స్‌ను బాగుచేయించుకోగా మొత్తం మీద 14,600 వాహనాలకు ఉచితంగా మరమ్మతులు చేశామన్నారు. వరద బాధితులకు మా వంతు ఏదో ఒకటి చేయాలన్న ఉద్దేశంతో అసోసియేషన్‌లో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

బాధితుడికి ఆర్థిక సాయం



పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామానికి చెందిన వీరబాబు కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. దీంతో మాజీ ఎంపీపీ నెలకుదుటి వరప్రసాద్ దాతలు ప్రవాసాంధ్రుడు వంకాయలపాటి రజనీకాంత్, రూప దంపతులు అందించిన రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. వరప్రసాద్ మాట్లాడుతూ వరప్రసాద్ మిత్ర మండలి ద్వారా బాధితుడుకి అండగా ఉంటామన్నారు. వారి వెంట కాకతీయ విద్యా సంస్థల డైరెక్టర్ శీలంనేని సాంబశివరావు ఉన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: పట్టణంలో సామాజిక సేవలు అందిస్తూ పేద ప్రజలకు గంజి రాములు కుటుంబ సభ్యులు అండగా నిలుస్తున్నారని న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. గంజి రాములు 10వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారులు గంజి అంజయ్య, వీరాస్వామి, శ్రీనివాసరావులు కలిసి ఆదివారం 15 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థిని పాలవాయి కృష్ణవేణికి రూ. 10 వేలు, నూర్ బాషా సైదులుకు రూ.5 వేలు సాయం అందించారు. పణిదం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు, స్థానిక పెద్దలు కాకుమాను కుమార్, వంగర సదాశివరావు, లక్ష్మీ, బిట్ర పానకాలు, గోలి వంశీకృష్ణ పాల్గొన్నారు.

వేడుకగా వినాయక నిమజ్జనోత్సవాలు



ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని నాగార్జుననగర్‌లో గల శ్రీశ్రీ నగర్‌లో ఏర్పాటు చేసిన 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. అనంతరం లడ్డూ వేలం పాట నిర్వహించారు. 61 కేజీల వినాయక లడ్డూను పట్టణానికి చెందిన గణపా వెంకట హసాన్‌రెడ్డి రూ.1.21 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం ప్రతిష్ఠించిన చోటే మట్టి వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. పట్టణ వ్యాప్తంగా ఆదివారం 14 వినాయక విగ్రహాలను కోలాహలంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. మండలంలో మొత్తం 15 వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

హిందీ పండిట్ సుభానికి సత్కారం



షేక్ మహబూబ్ సుభానికి సత్కారం

క్రోసూరు: క్రోసూరుకు చెందిన హిందీ పండిట్ షేక్ మహబూబ్ సుభానీని ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఏపీ ఎంఈడీస్ ప్రాస్‌పరిటీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించింది. శనివారం విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ పరీక్షల ఎగ్జామ్స్ డైరక్టర్ దేవానందరెడ్డి పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు, ఏఎన్‌యూ ఎగ్జామ్స్ డీన్ టి.స్వరూపారాణి, కృష్ణా వర్సిటీ ప్రొఫెసర్ యూవీ శైలజ పాల్గొని, ప్రసంగించారు. అసోసియేషన్ ప్రతినిధులు అనంతపురంలోని నవోదయ పాఠశాలలో హిందీపండిట్ గా షేక్ మహబూబ్ సుబాని అందించిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

నీట మునిగిన పత్తి పంట పరిశీలన

పెదకూరపాడు: ఇటీవల అధిక వర్షాలకు నీట మునిగిన పత్తి పంటను పరిశీలించేందుకు రాష్ట్ర వ్యవసాయ పకృతి బృందం సభ్యులు పెదకూరపాడులో ఆదివారం పర్యటించారు. పకృతి వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కలో వ్యాధి నిరోధక శక్తి, పురుగు తెగుళ్ల బెడద, వానపాముల పరీక్షలు నిర్వహించారు. బృందం సభ్యుడు రవిచంద్ర మాట్లాడుతూ మూడేళ్ల పైబడి ప్రకృతి వ్యవసాయం క్షేత్రాల్లో నీటిని నిలుపుకునే శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులు అమూల్య, హుస్సేన్, సాంబశివరావు, రసాయన వ్యవసాయ రైతులు ఏసుపాదం, శంకర్, మురళి వ్యవసాయ క్షేత్రాల్లో ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు సైదయ్య, శ్రీలక్ష్మీ జ్యోతి, మధుబాబు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



చిన మసీదు వీధిలో ప్రార్థనలకు హాజరైన ముస్లిం కుటుంబాలు

చిలకలూరిపేటటౌన్: సమాజంలో దురాచారాలను పెకలించి.. మానవాళిని సన్మార్గం వైపు నడిపించిన మొహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని ముఫ్తీ మొహమ్మద్ అబ్దుల్ కలీం చెప్పారు. మండలంలోని పసుమర్రు గ్రామంలోని చినమసీదు బజారులోని ఆదివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా చెట్టు వద్ద ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మొహమ్మద్ ప్రవక్త(సఅసం) జన్మదినాన్ని ఈ మాసమంతా ముస్లింలు వాడవాడలా ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. చినమసీదు వీధిలోని ముస్లిం కుటుంబాలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమష్టిగా చేయడం అభినందనీయం అన్నారు. మౌలాన బాజీ, సుల్తాన్ దువా చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలను షేక్ మస్తాన్ షరీఫ్-నసీమా, అబ్దుల్‌రవుఫ్-గౌసియా, అబ్దుల్ రవుఫ్-మెహెర్, ఫర్మానుల్లా-సానియా, సమీర్, ఖాదర్‌మస్తాన్ పర్యవేక్షించారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



మాచర్ల: పట్టణంలో బస్టాండ్ వెనుక ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బోయ రామిరెడ్డి, బండ్ల వెంకటేశ్వర్లు, పోలిశెట్టి పిచ్చయ్య, కజ్జం గురవయ్య, కొత్తమాసు బ్రహ్మారావు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



చిత్తడిగా బెల్లంకొండ - వన్నాయపాలెం రోడ్డు



అధ్వానంగా ఉన్న చంద్రాజుపాలెం పొలాలకు వెళ్లే రోడ్డు



అధ్వానంగా వెంకటాయపాలెం పొలాలకు వెళ్లే రోడ్డు

ఈ దారులు.. సాగుకు అనుకూలం

మండలంలోని పలు గ్రామాల్లో పొలాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గుంతలు పడి ఉండడంతో పాటుగా ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచి చిత్తడిగా మారాయి. పొలాలకు వెళ్లే రోడ్లే సాగుకు అనుకూలంగా మారాయి. చంద్రాజుపాలెం నుంచి మఠం వైపుగా వెళ్లే రోడ్డు, బెల్లంకొండ జీసీ కాలనీ నుంచి వన్నాయపాలెం వైపు వెళ్లే రోడ్డు రొచ్చు రొచ్చుగా తయారయ్యాయి. వెంకటాయపాలెంలో శింగరేశ్వర స్వామి ఆశ్రమం వైపు పొలాలకు వేళ్లే రోడ్డు గుంతలు పడి, బురదమయంగా మారింది. పొలాలకు వెళ్లే రైతులు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న ప్రస్తుతం.. బురద రోడ్లపై ఎరువుల బస్తాలను ద్విచక్ర వాహనాలపై తీసుకువెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - బెల్లంకొండ

చిన్నారుల విద్యపై జాగ్రత్తలు తీసుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వనమా పూర్ణచంద్రరావు

అమరావతి: ఆధునిక ప్రపంచంలో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని, చిన్నారుల విద్య పట్ల ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు విభాగ్ అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిరంలో గుంటూరు విభాగ్ ఫౌండేషన్ లెవెల్ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం రెండవ రోజు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రధానాచార్యులు కోలా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ చిన్నారులకు పంచకోశాత్మక వికాసాలు కలిగే విధంగా విద్యా విధానం ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రధాన ఆచార్యులు సోమిశెట్టి శివపార్వతి మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే నైపుణ్యం, సృజనాత్మకత కలిగించే విధంగా విద్యా విధానం కొనసాగాలని అందుకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అమరేశ్వరాలయ ఈఓ వేమూరి గోపి విశ్వనాథ శర్మ, పాఠశాల సభ్యులు శనగవరపు రామ్మోహన్ శర్మ, పులిపాటి పవన్ కుమార్, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని శిశుమందిర్ ఆచార్యులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న కోలాటం

వైభవంగా వినాయకుని శోభాయాత్ర



పెదకూరపాడులో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

పెదకూరపాడు: పెదకూరపాడు వినాయకుని శోభాయాత్ర ఆదివారం కనుల పండువగా సాగింది. సంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, భజన, డప్పు వాయిద్యాలు, భారీ బాణ సంచా, కళాకారుల నృత్యాలతో అలరించింది. పెదకూరపాడులోని మిట్ట ప్రాంతం నుంచి కచేరి సెంటర్ మీదగా, మహాలక్ష్మీ చెట్టు, సాయిబాబ దేవాలయం, నాగేంద్రస్వామి దేవాలయం మీదగా యాత్ర నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.



ఊరేగింపు సందర్భంగా ప్రత్యేక పూజల్లో నాయకులు

విద్యుత్ స్తంభాలు బాగు చేశారు

సాక్షి ఎఫెక్ట్

పెదకూరపాడు: ఈ నెల 14న ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. లగడపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పక్కన విద్యుత్ స్తంభాలు ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరిగాయి. మరికొన్ని పాఠశాలపై పడే ప్రమాద పొంచి ఉంది. దీంతో ప్లొక్లెయిన్ సాయంతో స్తంభాలను మర్మతులు నిర్వహించారు. దీంతో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

వాసవీ మాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు



వాసవి కన్యకాపరమేశ్వరి

రెంటచింతల: కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభించినట్లు దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం దేవస్థానంలో విలేకర్ల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. పార్వతిదేవి అంశలో జన్మించిన ఆర్య వైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి అమ్మవారి దసరా నవరాత్రుల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. 3న బాల త్రిపురసుందరీ దేవి, 4న ధనలక్ష్మీ దేవి, 5న గాయత్రీ దేవి, 6న అన్నపూర్ణదేవి, 7న సంతానలక్ష్మీ దేవి, 8న శ్రీ లలితా పరమేశ్వరి దేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషసుర మర్దినిదేవి, విజయ దశమి రోజు 12న రజత కవచదారణిదేవి అలంకారంలో భక్తులకు దర్శమిస్తారని తెలిపారు. విజయ దశమి పండగ రోజు భక్తులకు అన్న సంతర్పణ ఉంటుందని చెప్పారు.